
# ముద్దులల్లుడు



'గుంట్రు గుంట్రు గుంట్రు గుంట్రు గుంటూర్' బొగ్గు బస్సుకి బ్లోయరు కొడ్తూ అరుస్తున్నాడు క్లీనర్.

అది ఆరుగంటలకి అమరావతి నుంచి గుంటూరు వెళ్ళవలసిన ఫస్టు బస్సు. పాసింజర్లు ఆ క్లీనరు కేక అందుకుని "వచ్చె ..... వచ్చె" అంటూ ఉత్తరీయాలు వూపుకుంటూ బస్సు వైపు పరుగెత్తుతున్నారు.

ఇంజన్ వేడెక్కింది. క్లీనరు బ్లోయర్ కొట్టడం ఆపేశాడు కాని "గుంట్రు గుంట్రు గుంట్రు గుంట్రు గుంటూర్" అని అరవడం ఆపలేదు. కండక్టరు ఇడ్లీ. కాఫీముగించుకుని కిళ్ళీ నములుతూ బస్సు దగ్గరకొచ్చాడు.

బస్సులో కెక్కిన జనం వైపు తక్కువ జాతి వాళ్లను చూస్తున్నట్లు ఒక చిత్రమైన చూపు విసిరాడు. కిళ్ళీ ఆ బుగ్గనుంచి ఈ బుగ్గకి మార్చి "ఎవరివయ్యా ఈ

బస్తాలు? ఇది బస్సా, ఎడ్లబండా?" అని హుంకరించాడు. జనం బిక్కు బిక్కు మన్నారు.

సుబ్బయ్య, "నావేనండీ ఆ బస్తాలు" అని జాలిగా అన్నాడు.

"రూపాయిన్నరవుద్ది లగేజి "

"మొన్న ముప్పావలాయే తీసుకున్నారు గదండీ."

కండక్టర్‌కి వాదనంటే గొప్ప చిరాకు. "ఒరేయ్ కిట్టిగా" అని క్లీనర్‌ని పిలిచి "ఈ బస్తాల్నీ, సుబ్బయ్యగారినీ కిందకు లాగెయ్యరా" అన్నారు. సుబ్బయ్య డీలా పడిపోయి "అట్లాగే కానివ్వండి కండక్టర్‌గారూ" అన్నాడు.

"ఎవరా ఫ్రంటు సీట్లో ? ఫస్టు ట్రిప్పు ఓనరుగారొస్తారని తెలీదూ?" అనే సరికి ఫ్రంటు సీట్లో సరదాపడి కూర్చున్న కుర్రాడు పరుగు పరుగున బాక్ సీట్లోకి వెళ్లిపోయాడు.

"గుంటూరెందరో చేతులెత్తండి" అని కండక్టరు హుకుం జారీ చేసేసరికి గుంటూరు ప్యాసింజర్లందరూ చేతులెత్తారు.

"సరిగ్గా చేతులెత్తండయ్యా అన్నం తిని రాలా?" అని దబాయిస్తూ అన్ని ఊళ్లకి ప్యాసింజర్లని లెక్కవేసుకుని డబ్బు వసూలు చేశాడు కండక్టరు. బస్సు కిటకిటలాడింది.

ఊపిరాడటంలేదు. డ్రైవరు ఇంకా రాలేదు. జనం ఉక్కతో మగ్గిపోతున్నారు. ఎట్టకేలకు బీడీ కాల్చుకుంటూ తాపీగా వచ్చి నీళ్ళు పెట్టలేదనీ,అద్దం తుడవలేదనీ క్లీనరుగాడిని బూతులు తిట్టి బస్సు స్టార్ట్ చేశాడు.

బస్సు గుంటూరు రోడ్డెక్కటానికి బదులు బస్సు ఓనర్ రామకృష్ణయ్య ఇంటివైపుకు బయల్దేరింది. రామకృష్ణయ్య ఇంటిముందు బస్సు ఆపి డ్రైవరూ, కండక్టరూ, క్లీనరూ ఓనరుగారింట్లోకి వెళ్ళారు. ఎంతసేపటికీ ఓనరు ఊడిపడ్డే? ఓనరు భార్య కండక్టర్‌ని పొట్లకాయలు తెమ్మని పంపించింది. డ్రైవరుకీ, క్లీనర్‌కీ అటకమీంచి కట్టెపుల్లలు తీసేపని అప్పగించింది.

రామకృష్ణయ్య ఇంకా స్నానం చేస్తూనే ఉన్నాడు.

బస్సులో జనం కుతకుత ఉడికిపోతున్నారు. సుబ్బయ్యకి పెసల బేరం అర్జెంటు. సిద్ధాంతికి ఆలస్యమైతే ముహూర్తం మించిపోతుంది. పేరయ్య కోర్టు వేళకి చేరుకోవాలి. ఎందరికి ఎన్ని అర్జంటు పనులున్నా బస్సు ఓనర్‌గారి వీలును బట్టి బయల్దేరుతుంది.

ఓ అరగంట అయ్యాక రామకృష్ణయ్య బట్టలేసుకుని బస్సు దగ్గరికి వచ్చాడు. వెనకనే బస్సు పరివారమున్నూ. బస్సులోకి ఎక్కబోతూ తిరిగి ఇంట్లోకెళ్ళి భార్యతో ఏదో మాట్లాడాడు. ఈ మారు బస్సెక్కబోతుంటే భార్యే కబురుపెట్టింది.

మరో పదినిమిషాలు ఆలస్యం. ఎట్టకేలకు ఓనరుగారు సీట్లో కూచోగా కండక్టర్ "రైట్" అన్న కేక జనానికి గొప్ప హాయిగా ఉంది. పదడుగులు నడిచిందో లేదో ఫ్రంటు సీట్లో ఉన్న ఓనర్ 'వోల్డాన్' అన్నాడు. బస్సు ఆగిపోయింది.

"ఇవాళ దావా ఉంది, కరణంగారిని ఎక్కించుకురావాలని తెలీదుట్రా, తప్పుడు ముండాకొడకల్లారా?" అని డ్రైవరు వైపు చూస్తూ అన్నాడు. డ్రైవరు సరాసరి బస్సును కరణంగారింటివైపుకు పోనిచ్చాడు. అప్పటికి కరణంగారు ఇంకా సంధ్యావందనం ముగించుకోలేదు. అక్కడ మరో అరగంట ఆలస్యం. జనం బస్సులో కూర్చోలేక పోతున్నారు. దిగితే మళ్ళీ ఎక్కనివ్వరేమోనని భయం. వెనక కూర్చున్న సీతమ్మకి కళ్ళు తిరుగుతున్నాయి. సీతమ్మ నిండు చూలాలు, ఆడబిడ్డ నోము నోచుకుంటానంటే తప్పక బయల్దేరింది. పక్కనున్న ముసలమ్మ సీతమ్మ అవస్థ చూసి మరచెంబు విప్పి మంచినీళ్ళిచింది. మరో అరగంటకి బస్సు బయల్దేరింది.

ఆలస్యం అయినకొద్దీ అర్జంటు పనులున్న అందరు ప్రయాణీకులూ కంగారుపడి పోతున్నారు. బస్సు నరుకుళ్ళపాడు దాటింది. ఎండ్రాయి దాటింది. బస్సు కుదుపుకి సీతమ్మ తట్టుకోలేకపోతోంది. లేమల్లె అల్లంత దూరాన ఉందనగా సీతమ్మకి విపరీతమైన నొప్పులొచ్చాయి. ఆపుకోలేక పెద్దగా అరిచింది. గ్రహించిన

అమ్మలక్కలు బస్సు ఆపించారు. జనమంతా బస్సు దిగారు. చుట్టు పక్కల ఊరులేదు. ఆడకూతురుకి అర్థాంతరంగా నొప్పులొచ్చినాయి. ఏం జేతుమంటే ఏంజేతుమని కంగారు పడ్డారు. ఇంతలో ఎవరో చెరువు గట్టున చెట్టువారగా తెరకట్టండయ్యా" అన్నారు. పెట్టెలు తీసి చీరలు పంచెలతో చెరువు గట్టున అడ్డం కట్టారు. ఎండ పడకుండా ఓ దుప్పటి పైన బిగించారు.

కొందరు మగాళ్ళు పరుగు పరుగున పొలాల్లోకి వెళ్ళి మెత్తటి చొప్పకట్టల్ని తీసుకువచ్చి పక్కలా పేర్చారు. ఆడవాళ్ళు సీతమ్మను మెల్లిగా చొప్ప కట్టలమీద పడుకోపెట్టారు.

సీతమ్మకు నొప్పులు మరీ ఎక్కువైనాయి. హృదయవిదారకంగా ఏడుస్తోంది. దూరానున్న మగవాళ్ళకి గుండెలవిసిపోతున్నాయి. ఇప్పుడు వాళ్ళ మనసులో పెసలబేరం, ముహూర్తం, అందుకోవలసిన రైలు, కోర్టుదావా అవేమీ లేవు. ఒకేఒక్క దిగులు ఈ ఆడకూతురి కష్టం ఎట్లా గట్టెక్కుతుందా అని. అందరి గుండెలూ భారంగా ఉన్నాయి. సీతమ్మ ఏడుపులూ, కేకలూ ఎవ్వర్నీ నుంచో నివ్వడంలేదు. కూర్చోనివ్వడంలేదు. ఇంతలో చెరు ూ గట్టు వైపునుంచి కెవ్వుమని పసిపిల్లాడి ఏడుపు వినిపించింది. అందరి ముఖాలూ విచ్చుకున్నాయి. కొందరు ఎగిరి గంతేశారు. ఇంతలో ఓ ముసలమ్మ తెరల్లోంచి బయటకు వచ్చి మొగపిల్లాడు"అని కేక పెట్టింది. కొందరు పరుగు పరుగున పొలాల్లో కాపలా కాస్తున్న వాళ్ళ దగ్గరకెళ్ళి, బాన తీసుకొచ్చి రాళ్ళతో పొయ్యి చేసి నీళ్ళు కాచారు. ఓనరు రామకృష్ణయ్య బొడ్డుకోయటానికి తన మొలనున్న చాకు స్వయంగా తీసికెళ్ళి ఇచ్చాడు. సిద్ధాంతి అప్పటికప్పుడే జాతకచక్రం వేశాడు.

పిల్లాడికి స్నానం చేయించిన తర్వాత బస్సులోని జనమంతా వాడ్ని ముద్దాడారు, "సెరువు గట్టున పుట్టాడు సెంద్రిగాడు" అన్నారు. వాడికి ఆ పేరే ఖాయమైంది.

సెంద్రిగాడు అయ్య ఇంటా పుట్టలేదు. అమ్మ ఇంటా పుట్టలేదు. కాని ఊరంతా వాడికి మావలే. మళ్ళీ బస్సు బయలుదేరింది. అయితే ఇప్పుడు ఊరిపేరు చెప్పగానే చెయ్యెత్తలేని మరో ప్రయాణీకుడున్నాడు. *